క్లుప్తంగా

గణపతి మండపాల్లో ప్రత్యేక పూజలు

మల్కాపురం: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పారిశ్రామిక ప్రాంతంలో పలు మండపాల వద్ద గురువారం ప్రత్యేక పూజలు చేశారు. 59వ వార్డు నక్కవానిపాలెం వద్ద మండపంలో పూజల్లో ఎమ్మెల్యే కుమారుడు మౌర్య, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్క లక్ష్మణరావు యాదవ్ పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. ఇదే వార్డు పాత చెక్‌పోస్టు ఏరియా వద్ద ఏర్పాటు చేసిన మండపంలో ట్రేడ్ యూనియన్ నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్, జనసేన నాయకుడు రామకృష్ణ తదితరులు పాల్గొని గణనాథునికి పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఇక్కడ భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

శిక్షణ సద్వినియోగించుకోండి

ఆరిలోవ: ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో అందిస్తున్న శిక్షణను విద్యార్థులు సద్వినియోగపరుచుకోవాలని ప్రిన్సిపాల్ రమణ సూచించారు. ఇక్కడ డిప్లమో అసిస్టెంట్ కేటరింగ్ మేనేజ్‌మెంట్ కోర్సులో డిఫెన్స్ ఉద్యోగులు ఆరు నెలల పాటు పొందిన శిక్షణ పూర్తయిన సందర్భంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ వృత్తిపరమైన అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కోర్సు కో ఆర్డినేటర్ డాక్టర్ ఉజ్వల్‌కుమార్ ఘటక్, ఎఫ్‌సీఐ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం



ఎమ్మెల్యే గణబాబుకు చెక్కు అందిస్తున్న గౌరీ సంక్షేమ సేవా సంఘం సభ్యులు

గోపాలపట్నం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం మురళీనగర్ శ్రీగౌరీ సంక్షేమ సేవా సంఘం సభ్యులు విరాళం అందించారు. స్థానిక సంఘ సభ్యులు సేకరించిన రూ.25,516 మొత్తాన్ని చెక్కు రూపంలో గురువారం ఎమ్మెల్యే గణబాబుకు ఆయన కార్యాలయంలో అందజేశారు. విరాళాల సేకరణకు సహకరించిన సంఘ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు మళ్ల రమణ, కార్యదర్శి పాలమరశెట్టి చిన్న, సభ్యులు దాడి ఈశ్వరరావు, పిల్లా, హెచ్‌ఎన్‌ఆర్ జగన్నాథరావు తదితరులు పాల్గన్నారు.

సెయింట్ జోసెఫ్ కళాశాల వితరణ



విజయవాడకు సరకులు పంపిస్తున్న డాక్టర్ సిస్టర్ షైజీ

కంచరపాలెం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల యాజమాన్యం, సిబ్బంది రూ. లక్షా పాతిక వేలు విరాళం అందించారు. దీంతో బాధితులకు దుప్పట్లు, దోమతెరలు, కొనుగోలు చేసి విజయవాడ పంపించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. కార్యక్రమంలో సిస్టర్ మేరీ, నాన్సీ, డాక్టర్ సుధ, పి.కె. విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో బీజేపీ నాయకులు

మల్కాపురం: దేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాలు నేడు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపన చౌదరి, జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అన్నారు. 59వ వార్డు పరిధిలో గురువారం ఉదయం స్థానిక నాయకుల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చురుగ్గా చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిమేర శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. భయం భయం



గవర కంచరపాలెం రహదారి మలుపులో పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు

- ప్రమాదాలకు నిలయంగా రైల్వే రహదారులు
- రోడ్లకిరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు, ముళ్లపొదలు
- రాత్రి వేళ అంధకారంలో రాకపోకలు
- దృష్టి సారించని అధికారులు

కంచరపాలెం: జీవీఎంసీ 56, 57 వార్డుల కంచరపాలెం పరిధిలోని రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ మార్గాల్లో విద్యుత్ లైట్లు లేక రాత్రి వేళ అంధకారం నెలకొనడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదకర మలుపులతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైడిమాంబ కాలనీ రైల్వే లెవెల్ క్రాసింగ్ నుంచి గవర కంచరపాలెం మీదుగా రైల్వే లోకోషెడ్ రహదారి డీజిల్ షెడ్ వద్ద ఉన్న మలుపులతో ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రామ్మూర్తిపంతులుపేట, సుభాష్‌నగర్, గోకుల్‌నగర్, పైడిమాంబ కాలనీ, దయానందనగర్, అశోక్ పార్కు, ఆశవానిపాలెం, 104 ఏరియా, శ్యామ్‌నగర్, మర్రిపాలెం రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాలకు వెళ్లే వారు, డాక్‌యార్డ్, రైల్వే, ఎంఈఎస్ ఉద్యోగులు ఈ మార్గాన్నే వినియోగిస్తుంటారు. ఈ రోడ్డులో విద్యుత్ దీపాలు లేకపోవడంతో చీకటి పడితే ప్రమాదాలు జరుగుతున్నాయని ద్విచక్ర వాహన చోదకులు చెబుతున్నారు. రైల్వేకు చెందిన రహదారులు కావడంతో జీవీఎంసీ అధికారులు విద్యుత్ లైట్ల ఏర్పాటుపై దృష్టి సారించడం లేదని పలువురు అంటున్నారు.

ఇవీ సమస్యలు..

కంచరపాలెం నుంచి మర్రిపాలెం రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలతో కూడిన చెట్లు ఏపుగా పెరిగాయి. మలుపుల వద్ద వీటిని గుర్తించపోవడంతో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. దట్టంగా పెరిగిన తుమ్మ చెట్లు, పిచ్చిమొక్కలు, ముళ్ల పొదల మధ్య, రోడ్డు వెంబడి స్థానిక బిల్డర్లు, ఇంటి యజమానులు భవన నిర్మాణ వ్యర్థాలు(డెబ్రిస్) వేస్తున్నారు. రాత్రి వేళల్లో ఆకతాయిలు, మందుబాబుల అసాంఘిక కార్యకలాపాలకు రహదారులు అడ్డాగా మారుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి రహదారుల్లో ముళ్లపొదలు తొలగించాలని, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.



రామ్మూర్తిపంతులుపేట రైల్వే గేటు రోడ్డులో చీకట్లు



మర్రిపాలెం రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డులో ప్రమాదకరంగా మలుపు

చీకట్లోనే ప్రయాణం

రైల్వే ప్రాంత రహదారిలో రాత్రి వేళ ప్రయాణించాలంటేనే చీకట్లతో భయంగా ఉంది. ద్విచక్ర వాహనంపై వెళ్తుంటే ఆందోళనకరంగా ఉంటోంది. పాదచారుల పరిస్థితి మరీ దారుణం. విద్యుత్ స్తంభాలకు లైట్లు లేకపోవడం, రోడ్డుపైకి ముళ్ల పొదలు రావడంతో విషకీటకాలు సంచరిస్తున్నాయి. అధికారులు దృష్టి సారించాలి.

–ఆర్.చిన్నారావు, రైల్వే ఉద్యోగి, మర్రిపాలెం

అధికారులు చర్యలు చేపట్టాలి

రామ్మూర్తిపంతులుపేట రైల్వే గేటు నుంచి మర్రిపాలెం రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారి మలుపుల్లో పెరిగిన ముళ్ల పొదలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అటుగా రాకపోకలు సాగించాలంటే ఆందోళనగా ఉంది. విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి, మలుపుల వద్ద పొదలు తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

–పి.ఉమ మహేశ్వరరావు, దయానందనగర్

తూర్పు నావికాదళంలో హిందీ పక్షోత్సవాలు

సింధియా: తూర్పు నావికాదళంలో హిందీ పక్షోత్సవాలను తూర్పు నావికాదళ హెడ్‌క్వార్టర్స్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ రియర్ అడ్మిరల్ ఎమ్.మురళీమోహన్‌రాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా హిందీ వర్క్‌షాప్ తోపాటు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామని, అక్టోబర్ 10న అంతర్గత హిందీ మ్యాగ్జైన్ పూర్వవాణి 30వ ఎడిషన్ విడుదల చేస్తామని తెలిపారు. తూర్పు నావికాదళానికి చెందిన సర్వీస్ సిబ్బంది, పౌర సిబ్బందికి పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. హిందీ ప్రాముఖ్యతను పెంచేందుకు సిబ్బంది చేస్తున్న కృషిని ప్రశంసించారు.



విజేతకు బహుమతి అందిస్తున్న రియర్ అడ్మిరల్ మురళీమోహన్‌రాజు

అక్షయ పాత్ర వంటశాల పరిశీలన

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో గల అక్షయ పాత్ర ఫౌండేషన్ వంటశాలను జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ గురువారం సందర్శించారు. జీవీఎంసీ పరిధిలో ఇటీవల ప్రారంభిస్తున్న అన్న క్యాంటీన్లకు భోజనాల సరఫరా బాధ్యతను హరే కృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు అప్పగించడంతో వంటశాలను ఆయన పరిశీలించారు. ఆధునాతన పరికరాలతో వంట చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. శుచి శుభ్రతా విధానాల్లో రాజీ పడొద్దని సూచించారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ నిస్కించిన భక్తదాస్ వంట చేసే విధానాన్ని జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌కు వివరించారు. కార్యక్రమంలో యదురాజదాస్, రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



వంటశాలను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

‘ఉక్కు’ పరిరక్షణకు 1 నుంచి రాష్ట్రవ్యాప్త ఆందోళన

అగనంపూడి : స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకునేందుకు వచ్చేనెల 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నామని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా 1316వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి ఆయువుపట్టు వంటి విశాఖ ఉక్కు ఆంధ్రుల సొత్తని, దాన్ని బడాబాబులకు అతి తక్కువ ధరకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకించే ప్రతి తెలుగు జాతీయుడు ఈ ఉద్యమంలో పాల్గొని విజయంతం చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాలు, ప్రాంతాలకు అతీతంగా చేపడుతున్న ఈ ఉద్యమానికి ఊతమివ్వాలని అభ్యర్థించారు. కేంద్రం మొండిగా ముందుకు వెళ్లాలని చూస్తే భవిష్యత్‌లో జరగబోయే పరిణామాలకు కేంద్ర పెద్దలే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కె.రాజబాబు, జె.రామకృష్ణ, బి.ఎం.ఎల్.నాయుడు, వి.ఎస్.వరప్రసాద్, దుర్గారావు, ఈశ్వరరావు, పి.వి.రమణ, ఎం.గోవిందరావు, జి.ఆనంద్, జాన్సన్, బొద్దపు రమణ, డి.అప్పలనాయుడు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

మెగా రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక : టీడీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 6న నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరం పోస్టర్‌ను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. గత నాలుగేళ్లుగా తాము ప్రతి ఏడాది మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ నిర్వాహకుడు సనపల ఢిల్లీశ్వరరావు సీపీకి తెలిపారు. ఇప్పటివరకు 700 యూనిట్ల రక్తం సేకరించి, అవసరమైన వారికి అందజేశామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బి.గోవింద్, ఎం.అనిల్ కుమార్, చందు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ బాగ్చీ

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛతాహీ సేవ

అగనంపూడి : పరిశుభ్రతా కార్యక్రమంపై దువ్వాడ విజ్ఞాన్ ఫార్మా కళాశాల విద్యార్థులు దువ్వాడ రైల్వే ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫార్మా కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రైల్వేస్టేషన్ ఆవరణలోని చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే అనర్థాలు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సత్యలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.



స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

అన్నా క్యాంటీన్ ప్రారంభం



అన్నా క్యాంటీన్‌లో భోజనం తింటున్న ఎమ్మెల్యే గణబాబు, తదితరులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెంలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను గురువారం ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఆయన భోజనం రుచి చూశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు మౌర్యసింహ్, కోరాడ శ్రీనివాసరావు, సిహెచ్.రామ్మోహననాయుడు, మజ్జి మాలినాయుడు, పోతాబత్తుల శ్రీనివాస్, మిత్తిరెడ్డి శంకర్, శీరం ఉమామహేశ్వరి, సర్వసిద్ధి శ్రీలక్ష్మి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



లలిత గీతాలు ఆలపిస్తున్న సంస్థ సభ్యులు

సీతంపేట : స్వర రంజని సంగీత సాంస్కృతిక సంస్థ 35వ వార్షికోత్సవం సందర్భంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం లలిత సంగీత విభావరి నిర్వహించారు. సంస్థ అధ్యక్షురాలు లతా రాములు, ప్రధాన కార్యదర్శి గోల్కొండ రంగారావు, ఎంజీఎం ప్రసాద్, పి.సన్యాసినాయుడు, యోగ భాస్కర్, ఎం.అప్పారావు, చూడామణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంస్థ సభ్యులు 40 లలిత గీతాలను మధురంగా ఆలపించి ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో బ్రహ్మాజీ, లక్ష్మీ ప్రసాద్, పద్మిని, ఎం.లక్ష్మిరెడ్డి, రూపవాణి, ఎంవీఆర్ నాగేశ్వరరావు, లక్ష్మి నాయుడు, లీలాకుమారి, చలము భాయి లలిత గీతాలు ఆలపించారు. సోమేష్ బృందం వాద్య సహకారం అందించారు.

గవర్నర్‌కు స్వాగతం

గోపాలపట్నం: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ గురువారం విశాఖ చేరుకున్నారు. ఆయనకు అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆంధ్రా యూనివర్సిటీ మెరైన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న దివ్య కళామేళాలో పాల్గొనేందుకు గవర్నర్ ఇక్కడికి వచ్చారు. విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన నగరంలోకి వెళ్లారు.



విశాఖ విమనాశ్రయం నుంచి బయటకు వస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

‘మాతృ మరణాలు సంభవించరాదు’

మహారాణిపేట: మాతృ మరణాలు సంభవిస్తే ఆ ప్రాంత వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని, యూపీహెచ్‌సీలను నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం తన కార్యాలయంలో మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఇటీవల బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ పరిధిలో ఒక మాతృ మరణం సంభవించిందని, దీనిపై సంబంధిత అధికారులు వివరణ ఇవ్వాలని డీఎంహెచ్‌వో అన్నారు. ప్రతి గర్భిణిని సంబంధిత యూపీహెచ్‌సీలో చూపించాల్సిన బాధ్యత సంబంధిత వైద్య ఆరోగ్య కార్యకర్తలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జీవన్ రాణి, విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉష, అగనంపూడి ఏరియా ఆసుపత్రి, గైనకాలజిస్ట్ డాక్టర్ ఎస్.షర్మిల కుమారి, వైద్యులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ వె. మాధురి, డాక్టర్ వర్ణిక, డాక్టర్ ఎస్.సి.బి. నాయుడు, జిల్లా మీడియా విస్తరణాధికారి ఎం.నాగేశ్వర రావు, డాక్టర్ రేవతి, డాక్టర్ జి.శారదాదేవి, ఎం.శ్రీకళ, ఐ.మనోరమ, 108 జిల్లా మేనేజర్ వి.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.



మాతృ మరణాలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

ఇరువర్గాల గొడవలో ఒకరికి గాయాలు

గోపాలపట్నం: సీతన్న గార్డెన్‌లో వినాయక అనుపోత్సవంలో ఇరు వర్గాల మధ్య జరిగిన గొడవలో ఒకరికి గాయాలయ్యాయి. ఎయిర్‌పోర్టు జోన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సీతన్న గార్డెన్స్ బాయ్స్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించారు. బుధవారం రాత్రి అనుపోత్సవంలో భాగంగా విగ్రహం ఊరేగిస్తుండగా ఓ బాలిక చున్నీని ఒక యువకుడు లాగాడు. గమనించిన గెడ్డవలస సురేష్ ఆమె మా సోదరి అని చెప్పడంతో చిన్నాపటి వాగ్వాదం జరిగింది. అనంతరం ఊరేగింపు కొంత దూరం వెళ్లిపోయాక తేజ, లోహిత్ అనే యువకులు సురేష్‌ను బయటకు పిలిచి కొట్టారు. ఇంతలో పోలీసులకు సమాచారం అందడంతో వారు ఘటనా స్థలికి చేరుకుని యువకులను చెదరగొట్టారు. అనంతరం సురేష్ తన స్నేహితులు బలగ శేఖర్, శ్యామలరావు, కిరణ్, సురేష్‌కు విషయం చెప్పి అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో లోహిత్ ఇంటికి వెళ్లారు. ఇంటికి వెళ్లి తలుపు తట్టడంతో వారిపై లోహిత్ కత్తితో దాడి చేశాడు. దీంతో బలగ శేఖర్ పొట్టపై గాయమైంది. శేఖర్ ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్టు జోన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ సీహెచ్ ప్రసాద్ తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌లో సీసీక్యూసీ–2024 ప్రారంభం

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ చాప్టర్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ సర్కిల్ కాన్సెప్ట్స్ -2024 (సీసీక్యూసీ) గురువారం ప్రారంభమైంది. పెట్టుబడులు పెట్టడం, మెరుగైన భవిష్యత్తును నిర్మించడం అన్న అంశాలపై క్వాలిటీ సర్కిల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న కన్వెన్షన్‌ను ఏటీసీ టైర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ బి. ప్రహ్లాదరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉత్పాదకతపై ప్రభావం చూపడానికి క్వాలిటీ సర్కిళ్లు ప్రత్యేక సాధనమన్నారు. ఫైజర్ డైరెక్టర్ కట్టా రవిచందర్ గౌరవ అతిథిగా హాజరై మాట్లాడుతూ మంచి భవిష్యత్తు కోసం నిపుణులపై పెట్టుబడి పెట్టాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం జి. గాంధీ మాట్లాడుతూ ఒకరి నుండి మరొకరు నేర్చుకోవడానికి, సృజనాత్మక ఆలోచనల మార్పిడికి ఈ కన్వెన్షన్ మంచి వేదిక అవుతుందని అన్నారు. క్యూసీఎఫ్ఐ చాప్టర్ కార్యదర్శి ఎం.ఇ.సి.వి. సాగర్ మాట్లాడుతూ ఈసారి అత్యధికంగా 34 సంస్థల నుంచి ప్రతినిధులు హాజరు కావడంతో పాటు 129 కేస్ స్టడీలు సమర్పించనున్నట్లు తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కన్వెన్షన్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

ఓజోన్ పొర రక్షణ.. అందరి బాధ్యత



గొడుగులు పట్టుకుని ర్యాలీ చేస్తున్న డీఈవో చంద్రకళ, ఉపాధ్యాయులు విద్యార్థులు

ఆరిలోవ: ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని జిల్లా విద్యాశాఖాధికారి లెంక చంద్రకళ అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సాంకేతిక మండలి విశాఖపట్నం, తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులతో కలసి ఓజోన్‌పై అవగాహన కోసం గొడుగులు పట్టుకొని ర్యాలీ చేపట్టారు. ఓజోన్ పొరను కాపాడుకోవాలి.. అందరూ బాధ్యతతో మెలగాలి అంటూ నినాదాలు చేశారు. పాఠశాల నుంచి తోటగరువు వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ ఓజోన్ పొర ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. జీవావరణానికి ఓజోన్ పొర రక్షణ కవచంగా ఉందన్నారు. ఓజోన్ దెబ్బతినడం వల్ల వాతావరణంలో మార్పులు వస్తున్నాయన్నారు. సూర్యుడి నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాలు నేరుగా భూవాతావరణంలో ప్రవేశించి, భూమి ఓడెక్కడంతో పాటు అనేక రకాల వ్యాధులు వస్తాయన్నారు. ఓజోన్ పొర దెబ్బతింటే సకల జీవరాశుల మనుగడ ప్రమాదంలో పడుతుందని చెప్పారు. దీన్ని రక్షించుకోడానికి అందరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ఏపీకాస్ట్ జిల్లా సమన్వయాధికారి పి.రాజారావు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం టి.రామకృష్ణ, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు చంద్రాజీ, స్వామినాయుడు, పాఠశాల కమిటీ చైర్మన్ జాన్ ప్రసాద్, సభ్యులు అనురాధ, నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

బొలిశెట్టిపై చర్యలు తీసుకోండి

అల్లిపురం: ఉక్కు కార్మిక సంఘాల పట్ల అనుచిత వాఖ్యలు చేసిన జనసేన పార్టీ అధికార ప్రతినిధి బొలిశెట్టి సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బి.వెంకటరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. బొలిసెట్టిపై చర్యలు తీసుకోవాలని జనసేన రాష్ట్ర అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. ఉక్కు కార్మిక సంఘాల నాయకులందరూ వెధవలని, దొంగలని, అమ్ముడుపోయారని, పవన్ కళ్యాణ్‌ని కలవాలంటే యువ కార్మికులు ముందు యూనియన్ నాయకులను చాచి పెట్టి కొట్టి అప్పుడు రండి అంటూ కార్మికుల మనోభావాలు దెబ్బతినేలా తూలనాడారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవ చూపి అఖిలపక్ష రాజకీయ పార్టీలను, పోరాట కమిటీలను ప్రధాని మోదీ వద్దకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కె. రెహమాన్, జేడీ నాయుడు పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టింగ్ విజేతలకు సత్కారం



విజేతలను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించి, బంగారు పతకాలు సాధించాలని గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆకాంక్షించారు. ఈ నెల 14, 15 తేదీల్లో అమలాపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులను మండలంలోని సత్య హెల్త్ కేర్ జిమ్‌లో గురువారం సత్కరించారు. జిమ్ అధినేత డాక్టర్ ఎస్.రాజారావు వద్ద శిక్షణ పొందిన కండిపల్లి తేజ 370 కిలోల విభాగంలో బంగారు పతకం, జి.రాము, కండిపల్లి నవీన్ రజత పతకాలు సాధించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, వైఎస్సార్ సీపీ గాజువాక పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సీఐ దాలిబాబు తదితరులు పాల్గొన్నారు.